## శేరిలింగంపల్లిలో 2500 మందితో బందోబస్తు

ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు: మాదాపూర్ డీసీపీ సందీప్



శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎన్నికల నేపథ్యంలో బందోబస్తుకు సంబంధించి గచ్చిబౌలి స్టేడియంలో అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న మాదాపూర్ డీసీపీ సందీప్

శేరిలింగంపల్లి, నవంబర్ 29: శేరిలింగంపల్లి నియోజకవర్గంకు సంబందించి మొత్తం 2500 మంది వివిద విబాగాలకు చెందిన పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తును ఏర్పాటుచేయడం జరిగిందని మాదాపూర్ డీసీపీ సందీప్ పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వంహించారు. ఎన్నికల విదులకు సంబంధించి అధికారులు, సిబ్బందికి దిశానిర్ధేశం చేయడంతో పాటు సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. 28 సమస్యాత్మక ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్ బలగాలు పహారా మోహరించడం జరిగిందని తెలిపారు. అదనపు బలగాలు మూడు కంపెనీలు వచ్చాయని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వెంటనే చర్యలు తీసుకునేందుకు క్విక్ రియాక్షన్ బృందాలను ప్రత్యేకంగా రంగంలోకి దించామన్నారు. ఎన్నికల పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకొని పలువురు రౌడీషీటర్లతో పాటు అనుమానితులు బైండోవర్ చేసినట్లు తెలిపారు. బందోబస్తుకు సంబంధించి డీసీపీతో పాటు అడిషనల్ డీసీపీలు 3, ఏసీపీలు 10మందితో పాటు మరో 30 మంది ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వర్తిస్తారన్నారు. ఎన్నికల బందోబస్తు ఇతర శాంతి భద్రతల సమస్యల తలెత్తితే సమస్యలు సీ-విజిల్ యాప్, లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సైబరాబాద్ పరిధిలో ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడా కూడా నలుగురి కంటే ఎక్కువ మంది గుంపులుగా గుమికూడొద్దని ఈ సందర్భంగా ఆయన అన్నారు. వైన్‌షాపులతో పాటు హోటళ్లలో మద్యం విక్రయాలు జరపవద్దని నిబంధనలు ఉన్నాయని తెలిపారు. స్థానిక హోటళ్లలో ఇతర ప్రాంతాలకు చెందిన కొత్త వ్యక్తులు, అనుమానితులు ఉండరాదని, ఈ విషయమై హోటళ్లలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, డబ్బు పంపణీ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛగా పౌరులు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

- **సీసీ నీడలో..**

నియోజకవర్గంలో మొత్తం 922 కెమెరాలు పోలింగ్ ప్రక్రియలో వినియోగిస్తున్నారు. ఇందులో 638 కెమెరాలు పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్‌కు వినియోగిస్తుండగా.. మిగిలిన 324 కెమెరాలు పోలింగ్ కేంద్రాల బయట పని చేయనున్నాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన 24 వరకు కేంద్రాల వద్ద కెమెరాలు, పోలీసు, ప్రత్యేక బలగాలు పహారా కాయనున్నాయి.

# ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..

- **కుత్బుల్లాపూర్‌లో 6 లక్షల 69 వేల 253 మంది ఓటర్లు**
- **590 పోలింగ్ సెంటర్లు**
- **3 వేల మంది నిర్వహణ అధికారులు**
- **పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీగా బందోబస్తు..**



అల్వాల్ డీఆర్‌సీ సెంటర్‌లో ఎన్నికల విధుల్లో హాజరైన అధికారులు

కుత్బుల్లాపూర్,నవంబర్29: నేడు జరిగే ఓటింగ్‌కు అధికారులు అంతా సిద్ధం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ సెంటర్‌లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఓటింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలో 6 లక్షల 69 253 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 590 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందుకు గాను నిర్వాహణ కోసం 3 వేల మంది ఎన్నికల నిర్వాహణ అధికారులు ఉండగా 42 మంది అబ్జర్వర్లు, స్క్వాడ్ల విధుల్లో ఉన్నారు. 774 సీఈవీ, 744 డీయూవీ, 814 వీవీ ప్యాడ్ మిషన్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. కాగా అదనంగా 25 శాతం మిషన్లు అత్యవసర సమయంలో ఏర్పాట్లు చేసేందుకు సిద్ధం చేశారు. 41 రూట్లలో ఉన్న పోలింగ్ జరిగే కేంద్రాల్లో 590 వెబ్‌కాస్టింగ్ కెమెరాలు ఏర్పాటు చేసిన్నట్లు అధికారులు వివరించారు.

**వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు..**

పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులకు, దివ్యాంగులకు కావాల్సిన ప్రత్యేక సదుపాయాలను ఇప్పటికే పూర్తి చేశారు. వారికి కావాల్సిన వీల్‌చైర్స్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలను అధికారులు కల్పించారు. దివ్యాంగులకు 515 పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా మహిళలకు ప్రత్యేకంగా 56, 182, 280, 310, 409 పోలింగ్ బూత్ సెంటర్లు, మోడల్ పోలింగ్ కేంద్రాలు 36, 144, 305, 398, 437, యువతకు 173 కేంద్రాలకు ప్రత్యేకంగా కేటాయించారు. ఇంతకు ముందే ఇంటివద్ద నుంచి దివ్యాంగులు, వృద్ధులు ఫాం-12 డీ ద్వారా 80 ఏండ్లకు పైబడిన వృద్ధులు 300 మంది, 176 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకోగా వారిలో మొత్తం 456 ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. దాదాపుగా 10 వేలకు పైగా వృద్ధులు, దివ్యాంగులు ఉండడంతో వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**డీఆర్‌సీ సెంటర్ నుంచి ఈవీఎం మిషన్ల పంపిణీ..**

కుత్బుల్లాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో జరగనున్న పోలింగ్ ప్రక్రియకు అల్వాల్ లయోల కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్ నుంచి అధికారులు, సిబ్బందికి ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు ఏమాత్రం లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసేందుకు బుధవారం ఆర్‌ఓ పులి సైదులు నేతృత్వంలో తగు చర్యలు తీసుకున్నారు. దాదాపుగా 3 వేల మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో భాగస్వాములు కాగా వారికి ఓటింగ్ మిషన్లను, ఇతర సామగ్రిని పంపిణీ చేసి రూట్లలోకి పంపించారు.

**మేడ్చల్, బాలానగర్ జోన్ల పరిధిలో పటిష్ట భద్రత..**

మేడ్చల్, బాలానగర్ జోన్ల పరిధిలో జరిగే ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అల్లర్లు, ఇతర చర్యలు చోటు చేసుకోకుండా పూర్తి భద్రతను ఏర్పాటు చేసిన్నట్లు మేడ్చల్ జోన్ డీసీపీ షబరీశ్, బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాసరావులు తెలిపారు. మేడ్చల్ జోన్ పరిధిలో ఆరుగురు ఏసీపీలు, 20 మంది సీఐలు, 700 మంది సివిల్ పోలీసులు, 300 మంది సీఆర్‌పీఎఫ్ భద్రతా సిబ్బంది ఉన్నట్లు మేడ్చల్ డీసీపీ షబరీశ్ తెలిపారు. కాగా బాలానగర్ జోన్ పరిధిలో లోకల్ 1500, సీఆర్‌పీఎఫ్ 300, ముగ్గురు అడిషనల్ డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, 30 మంది సీఐలతో పూర్తి స్థాయి భద్రతను ఏర్పాటు చేసిన్నట్లు బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

**బాధ్యతతో ఓటు వేయండి ..**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నేడు జరిగే ఓటింగ్‌కు అంతా సిద్ధం చేశాం. ప్రతి ఓటర్ బాధ్యతతో ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావాలి. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. నిబంధనల మేరకు ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించేలా తగు చర్యలు తీసుకున్నాం.

– పులి సైదులు,
కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి



ఉన్నతాధికారులకు రిపోర్టు అందజేస్తున్న ఎన్నికల అధికారులు



పోలింగ్ సెంటర్లకు ఈవీఎం, వీవీప్యాడ్లను ఆయా పోలింగ్ కేంద్రాలను తీసుకెళ్తున్న ఎన్నికల అధికారులు

## ట్రాఫిక్ చిక్కులకు చెక్..



విశాలమైన రహదారి.. మధ్యలో పచ్చని మొక్కలతో ఆహ్లాదభరితంగా ఉన్న ఐడీపీఎల్ నుంచి బాలానగర్ వెళ్లే దారి..

**ఓటు హక్కును వినియోగించుకోండి**



ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ కుర్మయ్యాగారి నవీన్ కుమార్ కోరారు. నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పోలింగ్ ప్రక్రియలో ఓటర్లలందరూ భాగస్తులు కావాలన్నారు. ఓటు హక్కు అధికారాన్ని, బాధ్యతను కలుగజేస్తుందని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకుని ఓటరుగా గర్వించాలని కోరారు. పోలింగ్ డే ను సెలవు దినంగా భావించకుండా.. ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 29

ఈపీఐసీఎస్ ప్రాజెక్ట్‌తో

## విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది



ఈపీఐసీఎస్ ప్రదర్శించిన ప్రాజెక్టును వీక్షిస్తున్న కేఎల్‌హెచ్ హైదరాబాద్ విద్యార్థులు

మాదాపూర్, నవంబర్ 29 : కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీకి చెందిన కొండాపూర్ కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్‌లో ఇటీవల ఈపీఐసీఎస్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఐడియాథాన్‌ను ఏఐఎం(అటల్ ఇన్నోవేటివ్ మిషన్), నీతి అయోగ్, భారత ప్రభుత్వ సహకారంతో ఘనంగా నిర్వహించింది. ఇందులో 120కి పైగా వినూత్నంగా ప్రదర్శించిన ప్రాజెక్ట్‌ల్లో 800 మంది విద్యార్థులచే వాస్తవ ప్రపంచ సామాజిక సవాళ్లను పరిష్కరించేలా ఇంజినీరింగ్ పరిష్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ ప్రిన్సిపాల్, డాక్టర్ ఎ.రామకృష్ణ కన్వీనర్, డాక్టర్ ఎం.సైదిరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీ సర్వీస్‌లో ఇంజినీరింగ్ ప్రాజెక్టులకు సంక్షిప్త రూపం ఏపీఐసీఎస్ అని, ఇది ఇంజినీరింగ్ విద్యను సమాజ సేవతో అనుసంధానించే ఒక విలక్షణమైన కార్యక్రమమని అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల ఇంజినీరింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడమే కాకుండా సామాజిక అవగాహన, బాధ్యతను మరింత పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగా ఆటోమేటెడ్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్, స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, రెన్యూవబుల్ ఎనర్జీ హార్వెస్టింగ్ డివైసెస్, వేస్ట్ మేనేజ్‌మెంట్, రీసైక్లింగ్ టెక్నాలజీస్, హెల్త్‌కేర్ యాక్సెసిబిలిటీ టూల్స్ వంటి విభిన్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో కేఎల్ యూనివర్సిటీకి చెందిన పలువురు అధ్యాపక బృందం పాల్గొన్నది.